క్లుప్తంగా

ఘనంగా పైడితల్లమ్మ జాతర



బెలగాంలో జరుగుతున్న పైడితల్లమ్మ వారి ఘటాల ఊరేగింపు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో గల బెలగాం ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం 5 గంటల నుంచి గొర్లివారి కుటుంబ సభ్యులు రైల్వే కాలనీలో గల అమ్మవారి ఆలయంలో పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గాంధీనగర్‌లో గల గొర్లి సన్యాసిరావు గృహం నుంచి పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రధాన పూజారి గౌరీశంకర ప్రసాద్‌ను మేళతాళాల మధ్య ప్రధాన ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం ఆలయంలోని అమ్మవారి ఘటాలకు ముత్తయిదువులతో పాటు వారి కుటుంబానికి చెందిన పెద్దలు పూజలు చేశాక బెలగాం రైల్వే కాలనీతో పాటు పలు వీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

కొండచిలువ హతం



రైతులు హతమార్చిన కొండచిలువ

సీతానగరం: మండలంలోని తామరఖండి ఇటుక బట్టీవద్ద మంగళవారం రాత్రి కొండచిలువను రైతులు హతమార్చారు. సాయంత్రం పొలం పనుల కోసం వెళ్లిన మహిళలు కొండచిలువను గమనించి తప్పించుకుని వెళ్లిపోయారు. గాఢమైన చీకటి పడుతున్న సమయంలో ఇటుకబట్టీనుంచి వెలుపలికి వస్తున్న కొండచిలువను రైతులు గమనించి కర్రలతో హతమార్చారు.

వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వాహనానికి జీపీఎస్ పరికరం ఏర్పాటుకు సుమారు రూ.2500 ఖర్చవుతుందన్నారు. జీపీఎస్ లేకుండా ధాన్యం తరలిస్తూ పట్టుపడితే మొదటిసారి రూ.3 వేలు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. వాహన యజమానులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సవర భాషా వలంటీర్లకు శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వైటీసీలో సవర భాషా వలంటీర్లకు బుధవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ ఏఎంఓ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే గిరిజన గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు సవర భాష బోధించేందుకు వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. వారు మరింత మెరుగ్గా బోధించేందుకు అవసరమైన శిక్షణ, మెటీరియల్‌ను అందజేయనున్నట్లు చెప్పారు.

పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన



కూరగాయల విత్తనాలను అందజేస్తున్న స్ఫూర్తి సేవా సదన్ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్ఫూర్తి సేవా సదన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.భీష్మ అన్నారు. మండలంలోని జర్నా పంచాయతీ ఉరిటి గ్రామంలోని విద్యార్థులు, యువతకు మంగళవారం పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పెరటితోటల పెంపకంతో కుటుంబానికి కావాల్సిన పోషకాహారాలను సమకూర్చుకోవచ్చన్నారు. వివిధ రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు మీసాల మురళి, బాలరాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

9 నుంచి 'పల్లెకు పోదాం'

కురుపాం: మండలంలో ఈ నెల 9 నుంచి 22 వరకు 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.వి.శివరామప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మొదట విడతలో 9 సచివాలయాల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాలకు సంబంధించిన పోస్టర్లను గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శించడం, అర్హత ఉండి పథకాలు అందనివారికి గుర్తించడం జరుగుతుందన్నారు. 9న కురుపాం-2, 10న కిచ్చాడ, 14న బియ్యాలవలస, 15న రస్తాకుంటుబాయి, 16న గుజ్జువాయి, 17న పి.లేవిడి, 20న మొండెంఖల్, 21న మరిపిల్లి, 22న గొటివాడ గ్రామ సచివాలయల పరిధిలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మహిళా సంఘాల బలోపేతానికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే ఆలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన రుణాలతో చిన్నపాటి పరిశ్రమలు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా మహిళా సంఘ సభ్యులు కృషి చేయాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, ఎంపీడీఓ జావేద్, వెలుగు ఏపీఎం సురేష్, పార్వతీపురం మండలం మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారతకు పెద్దపీట

పార్వతీపురం టౌన్: సామాజిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీటవేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు.

ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని 15,20 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో ఈనెల 10న జరగనున్న సామాజిక సాధికార యాత్రలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్‌లు చీకటి అనూరాధ, భాస్కరరావు, సచివాలయ కన్వీనర్లు చందక ఆనంద్, గృహసారథులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం సిఫారసు

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా 2,474 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బగాది జగన్నాథ రావు తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. అప్పారావులు సిఫారసు చేసిన కేసులపై మంగళవారం సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా 1,24,589 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 2,474 మందిని మెరుగైన వైద్యం కోసం వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు చెప్పారు. రిఫరల్ చేసిన వారిని నవంబర్ 30వ తేదీ లోపు ఆయా ఆస్పత్రులకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించే బాధ్యతను సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రిఫరల్ కోసం వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రోగం నయం చేసి తగ్గేంత వరకు ఉచితంగా మందులు అందించాలని సూచించారు. ఆరోగ్య మిత్రల సహకారంతో వెంటవెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, తర్వాత చికిత్స అందించే పక్రియను త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. రిఫరల్ పేషెంట్లకు వైద్యం అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సిబ్బందికి హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాంబాబు, ఆరోగ్యమిత్రులు, టీం లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

రిఫరల్ కేసులపై ప్రత్యేక దృష్టి

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు, శస్త్రచికిత్సలకోసం రిఫరల్ చేసిన రోగులు పూర్తిగా కోలుకున్నంతవరకూ వైద్య సేవలుఅందిస్తూ వైద్యసిబ్బందిఅందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా బి జగన్నాథరావు సిబ్బదికి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌లు కె శిరీష, ఉషారాణిల ఆధ్వర్యంలో అధికార సిబ్బందితో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, హెల్త్‌సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రకు సిద్ధం

- హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



సామాజిక సాధికార బస్సు యాత్రకు సాలూరు మెయిన్‌రోడ్డులో జరుగుతున్న ఏర్పాట్లు

సాలూరు: అన్ని వర్గాల ప్రజ లకు న్యాయం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సామాజిక సాధికారత పాలనను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్‌సీపీ సైన్యం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో బుధవారం సాలూరు పట్టణ మెయిన్ రోడ్డులో సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలనను మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు వచ్చి ప్రజలకు వివరించనున్నారు. గిరిజనుడైన సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవిని, ఇదే జిల్లాకు చెందిన మాజీ ఎంపీ డీవీజీ శంకరరావుకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. కాగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చి సామాజిక సాధికారతకు జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసారు. నియోజకవర్గంలో 110 సర్పంచ్ స్థానాలకుగాను 53 మంది ఎస్టీ, 46 బీసీ, పది ఎస్సీ ఇతరులు ఒకరికి అవకాశం కల్పించి పంచాయతీ స్థాయి నుంచి సామాజిక సాధికారతను ఈ ప్రభుత్వం చాటి చెప్పింది. ఈ క్రమంలో జిల్లాలో సాలూరు నియోజకవర్గం నుంచి ప్రారంభం కానున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని కలిసిన కురుపాం ప్రెస్‌క్లబ్ సభ్యులు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కురుపాం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కాదా మౌళి, ప్రధాన కార్యదర్శిగా మోనింగి పృథ్విరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పిరిడి నాగరాజు, కోశాధికారి జి.ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆకుల మురళీకృష్ణ, గోటారి మనోజ్, పి.సంతోష్, సహాయ కార్యదర్శిగా చిప్పాడ గోపి, దొనక ప్రదీప్, సువ్వాన సోమేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా బరాటం చంద్రమౌళి, గొటారి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి అంతా కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా సహాయ కార్యదర్శి నెల్లి శ్రీనివాసరావు వ్యవహరించారు. మండలలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు

జియ్యమ్మవలస: కురుపాం మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. పాత్రికేయులకు ఇంటి స్థలాలు మంజూరుకు కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సన్మానించారు.

పంటకోత ప్రయోగాలతో ప్రయోజనం



వెంగాపురంలో పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు

బలిజిపేట: పంటకోత ప్రయోగాలవల్ల రైతులకు ఎంతోమేలు జరుగుతుందని, పంట దిగుబడి అంచనా వేయవచ్చని ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వెంగాపురంలో మంగళవారం ఆయన పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. పంటకోత ప్రయోగాలవల్ల పంట దిగుబడులు ఏమేరకు వస్తాయో తెలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు ఆర్.పైడితల్లి పంట పొలంలో 5అడుగుల పొడవు, 5అడుగుల వెడల్పు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగాన్ని మంగళవారం చేశారు. ఈ విస్తీర్ణానికి 18.5కిలోల దిగుబడి వచ్చిందని చెప్పారు. ఈ ప్రకారం ఎకరాకు 2,997కిలోల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. రైతుల పంటలకు ఈక్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల వారి పంటను వారు విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ మోహన్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలి

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: పదో తరగతి ఫలితాలను 100శాతం సాధించాలని మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు పిలుపునిచ్చారు. చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని టీఆర్ఎంఎం పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆ దిశగా హెచ్ఎంలు, ఆయా శాఖల అధికారులు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసినప్పుడే లక్ష్యం సాధించగలమని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో రేషన్ డిపో ఏర్పాటు



గ్రామసభలో మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ వి.మహేంద్రకుమార్, డీఎస్‌ఓ శివప్రసాద్

పాచిపెంట: మండలంలోని కేసలి పంచాయతీ కుంతాంబడేవలసలో నూతనంగా రేషన్ డిపో ఏర్పాటు చేయనున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ తెలిపారు. కుంతాంబడేవలసతో పాటు మరో 22 గ్రామాల ప్రజలు రేషన్ తీసుకోవడానికి సుమారు 20 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, రేషన్ తీసుకోవడానికి చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి తమ గ్రామాలకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి స్పందించి డిపో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా మంగళవారం జీసీసీ మేనేజర్ మహేంద్ర కుమార్, డీఎస్‌ఓ ఆర్ శివప్రసాద్, సీఎస్‌డీటీ రంగారావు, కుంతాంబడేవలసలో గ్రామ సభ ఏర్పాటు చేసి త్వరలో రేషన్ డిపో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి పరిష్కరించిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

6వేల దిశయాప్‌ల డౌన్‌లోడ్

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



బలిజిపేట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

బలిజిపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో దిశ యాప్‌పై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ, ఇప్పటివరకు 6వేల మందితో మొబైల్ ఫోన్లలో యాప్‌లు డౌన్‌లోడ్ చేయించామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన బలిజిపేట పోలీస్‌స్టేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 20 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, రోడ్డు భద్రతా చర్యలు చేపడుతుండడం వల్ల క్రైం రేటు తక్కువగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే పోలీస్ పెట్రోలింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు. దిశ, ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలపై దృష్టిసారించి ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదుచేయనున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించి చట్టాలను గౌరవించాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుని కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు ఆయుధం దిశ యాప్

పార్వతీపురంటౌన్: మహిళలను ఆకతాయిల నుంచి రక్షించేందుకు దిశ యాప్ ఆయుధంలా ఉపయోగపడుతుందని దిశ డీఎస్పీ హర్షిత అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా దిశయాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో భాగంగా పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పార్క్‌లు, సినిమా థియేటర్లు, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలు, విద్యార్థులకు మంగళవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో దిశయాప్ ఉండాలని, ఆపద సమయాల్లో ఉపయోగించి పోలీసుల సహకారం పొందాలని పిలుపునిచ్చారు. ర్యక్రమంలో డీఎస్పీ జి.మురళీధర్, పట్టణ సీఐ కృష్ణారావు, ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

సీతానగరం: ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించడానికి తెచ్చిన దిశ యాప్‌ను మొబైల్ ఫోన్ ఉన్న వారంతా డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాలని ఏఎస్సై జి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర రహదారిలో మహిళా పోలీసులతో ప్రధాన కూడళ్లలో వాహనాలను నిలిపి దిశయాప్ డౌన్‌లోడ్ చేసే కార్యక్రమంపై అవగాహన కల్పించారు.



పార్వతీపురం టౌన్: ప్రభుత్వ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న దిశ డీఎస్పీ హర్షిత తదితరులు



సీతానగరం: దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న ఏఎస్సై శ్రీనివాసరావు

ఎఫ్‌పీసీ విధానంలో మెరుగైన వైద్యసేవలు



జమదాలలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

- వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) ద్వారా గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని జమదాల గ్రామంలో ఫ్యామిలీడాక్టర్ విధానంలో 80మందికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు క్రమం తప్పకుండా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గర్భిణులు, వృద్ధులు మంచాన పడి ఉన్న రోగుల ఇళ్లవద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఈ వైద్యసేవలను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. వైద్యశిబిరం నిర్వహించిన ముందు రోజు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్ల ద్వారా సమాచారం అందించడంతో పూర్తిస్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లోనే 17రకాల రక్తపరీక్షలతో పాటు 151 రకాల మందులను ప్రజలకు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్ల పరిశీలన



పార్వతీపురంలో సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

పార్వతీపురం టౌన్ / సీతానగరం:

సామాజిక సాధికార యాత్ర కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలనకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట గ్రామం వద్ద ఎమ్మెల్యే జోగారావు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం లచ్చయ్యపేట గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న మీడియా సమావేశం ప్రదేశంతో పాటు కాశీపేట గ్రామం వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం భవనాన్ని వారు పరిశీలించారు. తరువాత నేరుగా పార్వతీపురంలోని పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయనున్న సభావేదిక స్థలాన్ని పరిశీలించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భద్రత

జియ్యమ్మవలస: పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి శిబిరంలో అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు.

ఆశా కార్యకర్తలే కీలకం: డీఐఓ



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

వీరఘట్టం/పాలకొండ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వైద్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు అన్నారు. వీరఘట్టం మండలం బిటివాడ, వీరఘట్టం పీహెచ్‌సీలతో పాటు పాలకొండ మండలం అన్నవరం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నవజాత శిశువులను, ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి వారు రక్తహీనతను అధిగమించేలా చికిత్సలు అందించాలని సూచించారు. పిల్లలకు వేస్తున్న ఐరన్ సిరప్, విటమిన్-ఏ, టీకాలను షెడ్యూల్ ప్రకారం అందేలా చూడాలన్నారు. వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.